# భద్రత

"సూ మొ, బ్యాంకు జాబ్ వదిలేసాడు తెలుసా ? ఏదో ప్రైవేట్ కంపెనీలోకి రెట్టింపు జీతంతో వెడుతున్నాడట" దరా (దద్దమ్మరావు) ఉరఫ్ దామోదరం సమాచారం చదివాడు.

"అందుకనే గదా అతన్ని మనం సూమొ (సూదిమొన) అంటాం. సూదిలా దూసుకు పోతాడు. హాయిగా బంగారుగుడ్లు పెట్టే బాతు లాంటి ప్రభుత్వరంగ బ్యాంకులోని ఉద్యోగం చేయక, వెట్టిచాకిరీ చేయడానికి పూనుకోవడమేమిటి? ఏరా (ఏడుపు రావు) ఉరఫ్ ఏకాంబరం ఎద్దేవా.

"మంచి అణుకువగా ఉండే భార్యను వదిలి టక్కుల మారి ప్రియురాలి వెంట పడడం గాకపోతే, తెలివైన వాడు చేసే పనేనా? ప్రశ్నించాడు ఈతో (ఈకతోక) ఉరఫ్ ఈశ్వర ప్రసాద్.

"రెట్టింపు జీతంతో వెళ్తున్నాడు తప్పేముంది? సమర్థించాడు గోమీపి (గోడమీది పిల్లి) గోపాలం.

"అదే నువ్వైతే నీ గవర్నమెంట్ ఉద్యోగం వదిలి ప్రైవేట్ జాబ్‌లో చేరతావా? " ఈతో సవాల్.

"అమ్మమ్మమ్మా! ఎంతమాట? రెండింతలు కాదు గదా నాలుగింతలు జీతం ఇచ్చినా ప్రైవేటు కంపెనీలో చేరను గాక చేరను" ప్లేటు ఫిరాయించాడు గోమీపి.

వీళ్ళంతా ఉద్యోగ రీత్యా ముంబయి వచ్చిన తెలుగువాళ్ళు. శనివారం కొందరికి సెలవు రోజైతే కొందరికి సగం రోజు ఆఫ్. ప్రతి శనివారం, వాళ్ళు సాయంత్రం పూట, దాదర్ పార్సీ కాలనీలోని ఫైవ్ గార్డెన్స్ (అయిదు ఉద్యానాల సమూహం)లో

కలుసుకుని కబుర్లు చెప్పుకుంటారు. రాత్రి ఏ హోటల్లోనో భోజనం కానిచ్చి, నగర శివార్లలో వారి వారి ఇళ్లకు పోతారు.

సూమో అని ముద్దుగా పిలువబడే సూరపశర్మవారి చర్చలోని వ్యక్తి.

చాకులాంటి సూమొ గత అయిదేళ్ళుగా ప్రభుత్వరంగ బ్యాంకు ఆఫీసరుగిరీ వెలగబెడుతూ కంపెనీ సెక్రటరీ కోర్సు పాసయ్యాడు.

బ్యాంకుల్లో కంపెనీ సెక్రెటరీ చేసినవాళ్ళకు ప్రాముఖ్యత కొరవడడంతో, తను నేర్చిన కోర్సుకి సార్థకత కూర్చే ఉద్యోగం, మంచి హోదా, జీతంతో దొరికే సరికి, అందరూ ప్రాకులాడే 'గవర్నమెంట్ జాబ్' అవలీలగా, ఏ మాత్రం సంకోచం లేకుండా వదిలేశాడు. దాని గురించే ప్రపంచంలోని ఎనిమిదవ వింతగా చెప్పుకుంటున్నారు అతని మిత్ర బృందం.

"అవునూ, ఇందాక ఏదో భార్య, ప్రియురాలు అన్నావు, దానికి సూమోకి ఏమిటి లింకు? 'దరా' ధర్మసందేహం.

"ఆ మాత్రం ఊహించలేవూ? ప్రభుత్వోద్యోగం భార్యలాంటిది. ఇంట్లో ఎన్ని ఆగడాలు చేసినా, ఎంత పెత్తనం చలాయించినా అణిగి, మణిగి ఒద్దికగా ఉంటుంది భార్య. అలాగే పనిచేసినా, చేయకపోయినా, ఎంత గడ్డితిన్నా కిక్కురు మనదు ప్రభుత్వం. ఎవరన్నా ప్రశ్నిస్తే యూనియన్ అండ ఉండనే ఉంది. నెలనెలా జీతం మాత్రం ఠంచనుగా అందుతుంది. సీటు గట్టిదైతే 'గీతం' కూడా లాగొచ్చు. అంతేకాదు, రిటైరయ్యాక కూడా ఇంట్లో కూర్చొని హాయిగా పెన్షనుతో గడపవచ్చు. చచ్చేదాక భార్య ఎలా సేవ చేస్తుందో, ప్రభుత్వ ఉద్యోగం కూడా మనల్ని చివరిదాకా సుఖపెడ్తుంది. ఈతో విశదీకరించాడు.

"ఆ రోజులు పోయాయి. ఇప్పుడు భార్యలు కూడా తెలివిమీరారు. టీవితో కాలక్షేపం చేస్తూ, ఆ సీరియల్స్‌లోని ఆడవాళ్ళలా భర్తను ఖాతరు చేయకుండా ఉన్నారు. స్త్రీవాద రచనల పుణ్యమా అని విడాకులకు కూడా సై అంటున్నారు." ఏరా వాపోయాడు "నువ్వనేది మినహాయింపుల గురించి. వారు 5% కూడా ఉండరేమో. మిగతా 95% నేను చెప్పే సామాన్య భార్యల లాంటి వారే" 'ఈతో' సమర్థింపు.

"మరి ప్రియురాలి సంగతేంటి?" 'దరా' సందేహం తీరలేదు.

"సింపుల్. ప్రియురాలిలో ఆకర్షణ ఉంటుంది. ఆ హొయలుకు మనిషి పడిపోతాడు. అలాగే ప్రైవేటు కంపెనీలో పెద్ద జీతం 'ఎర' ఉంటుంది. దాన్ని చూపి గొడ్డుచాకిరి చేయించుకుంటారు. రెట్టింపు జీతం ఇచ్చి, నలుగురి పని చేయమంటారు. వల్లకాదంటే ఇక ఇంతే సంగతులు. ఉద్యోగానికి ఉద్వాసన. ప్రియురాలు కూడా వగలుతో తన

చుట్టూ త్రిప్పించుకుంటుంది. తన కోరికలన్నీ ప్రియుడి ద్వారా తీర్చుకుంటుంది. తేడా వస్తే వదిలేస్తానని బెదిరింపు. అందుకని జనం ప్రియురాలిని భార్యగా చేసుకోవాలని తహతహలాడుతుంటారు. పెళ్ళయేదాకా అమ్మాయి బాస్, పెళ్ళయిం తర్వాత భర్తబాస్. అందుకని భార్యలో ఉన్న భద్రత ప్రియురాల్లో లేదు. గవర్నమెంట్ పోస్టులో ఉన్న సేఫ్టీ ప్రైవేట్ జాబ్‌లో లేదు." ఈతో పెద్ద ఉపన్యాసమే దంచాడు.

"సారీ ఫ్రెండ్స్ కాస్త లేటయింది". సూమొ ఊడిపడ్డాడు.

"కాస్తకాదు నాయనా గంటన్నరైంది.

మేమెచ్చి. నీ కొరకు చూసి, చూసి కళ్లల్లో తాటికాయల మొలిచాయి." ఏరా సన్నాయి నొక్కులు. "కొత్తజాబ్. అదీ ప్రైవేట్ కంపెనీలో ఆ మాత్రం అర్థం చేసుకోవాలి మీరు". సంజాయిషీ ఇచ్చాడు సూమొ.

"అదే బాబూ మేము కూడా అనేది. సుఖంలో ఉన్న ప్రాణాన్ని, తెలిసి, తెలిసి కష్టాల్లోకి నెట్టడం ఎందుకూ అని" గోమీపి ఉవాచ.

"అదేంటి గోమీపి? నువ్వే కదా నన్ను ప్రోత్సహించింది? అయినా సవాళ్ళను ఎదుర్కొంటూ, ముందుకు దూసుకుపోవడంలో ఉన్న ఆనందం, కదుపులో చల్లకదల కుండా చేసే ఉద్యోగంలో ఎక్కడ? శ్రమకు తగ్గ ఫలితం ప్రైవేటు రంగంలో ఉంటుంది. విదేశీ సంస్థలు మన దేశం వచ్చిన తర్వాత ప్రైవేటు రంగంలో అవకాశాలు బాగా పెరిగాయి. లకారాల్లో జీతాలిస్తున్నారు. ప్రభుత్వ సంస్థల్లో అది సాధ్యమా?"

"సూమొలో ఆవేశం. ప్రభుత్వ సంస్థల్లో కోట్లకు పడగలెత్తినవారు ఎందరు లేరు?" ఈతో ప్రశ్న.

"ఇంటి బీరువాలో, గోనే సంచుల్లో, బ్యాంకు లాకర్లలో కోట్ల నోట్లు దాచి ఉంచే ప్రభుత్వాధికారుల ఊసువద్దు. అటువంటి పాపిష్టి డబ్బు కూడదనేగా నేను, సక్రమ మార్గంలో ఎక్కువ సంపాదన వీలున్న సంస్థలో చేరాను". సూమొ మాటల్లో నిజాయితీ.

"నీ అంత చొరవ, ధైర్యం మాలో లేవు. మేమిలాగే బావున్నాం. ఈ చర్చకి అంతూ పొంతూ లేదు. ఇక ఇంతటితో దీనికి స్వస్తి పలికి ఆత్మరాముడి సంగతి చూద్దామా?" ఏరా కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి.

"ఈ రోజు డిన్నర్ నా తరపున సరేనా?" సూమొలో అప్పుడు డబ్బు గల, గల.

"అంతకంటేనా?" కోరస్ పాడుతూ లేచారు మిత్ర బృందం.

నేటి నిజం "స్వాతంత్ర్య దినోత్సవ" ప్రత్యేక అనుబంధం

**2006**